బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 5

హైదరాబాద్‌లో రెండు రోజులు వైన్స్ బంద్ !

బలగం టీవి, హైదరాబాద్

వినాయక నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 17, 18 తేదీల్లో వైన్స్‌ను మూసివేస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. జంటనగరాల్లోని వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను ఆ రెండు రోజులు మూసివేయాలని ఆదేశించారు. 17వ తేదీ ఉదయం 6గంటల నుంచి వైన్స్‌ను బంద్ చేయాలని పేర్కొన్నారు. క్లబ్బులు, స్టార్ హోటళ్లలోని బార్లను మినహాయింపు ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి బంద్ చేయాలని, నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పార్లమెంటేరియన్‌గా స్వరం వినిపించారు

"ఏచూరి మృతిపై విచారం వ్యక్తం చేస్తున్నాను. మొదట విద్యార్థి నాయకుడిగా, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లో, పార్లమెంటేరియన్‌గా తన స్వరం వినిపించారు. నిబద్ధత ఉన్న సిద్ధాంతకర్త అయినప్పటికీ అన్ని వర్గాల్లో స్నేహితులను సంపాదించుకున్నారు. అతని కుటుంబ సభ్యులతో పాటుగా సహచరులకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను"

–రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఏచూరి గొప్ప వ్యక్తి

"సీతారాం ఏచూరి మృతి నన్ను బాధించింది. వామపక్షాలలో ఆయనో గొప్ప వ్యక్తి. వామపక్షాలకు ఆయన ఓ మార్గదర్శి. ఏచూరి వామపక్ష ఉద్యమానికి దిక్సూచీ వంటి వారు. ఆయన సామర్థ్యం, వాగ్ధాటి పార్టీలకు అతీతంగా అందరినీ ఆకట్టుకునేది. సమర్థవంతమైన పార్లమెంటేరియన్‌గా ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో నా ఆలోచనలన్నీ ఆయన కుటుంబసభ్యులపైనే ఉన్నాయి." అని అన్నారు.

– ప్రధాని మోదీ

దేశ ఆలోచనలకు రక్షకుడు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు. "సీతారాం ఏచూరి నాకు ఒక స్నేహితుడు. లోతైన అవగాహనతో భారతదేశ ఆలోచనలకు రక్షకుడు. ఆయనతో జరిపిన సుదీర్ఘ చర్చలను కోల్పోయాను. ఈ దుఃఖ సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అనుచరులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని పోస్ట్ చేశారు.

– కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ

సీతారాం ఏచూరి కన్నుమూత

బలగం టీవి, న్యూఢిల్లీ

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి, వామపక్ష యోధుడు, ప్రముఖ రాజకీయ వేత్త సీతారాం ఏచూరి(72) కన్నుమూశారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో ఆయన తుదిశ్వాస విడిచారు. కొన్నాళ్లుగా ఆయన శ్వాసకోస సమస్యలకు చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే గురువారం మధ్యాహ్నం 3.03 గంటలకు ఆయన ప్రాణాలు విడిచారు. ఈ మేరకు ఆస్పత్రితోపాటు సీపీఐ(ఎం) వర్గాలు తెలిపాయి

ఆగస్టు 19వ తేదీన ఎయిమ్స్ ఎమర్జెన్సీ వార్డులో ఆయన్ను చేర్పించారు. ఆ తర్వాత ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు మార్చారు. 2015లో సీపీఐ(ఎం) పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కారత్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. పార్టీ నేత హరికిషన్ సింగ్ సుర్జీత్ వద్ద ఏచూరి ఎదిగారు. వీపీ సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ , యునైటెడ్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ఏచూరి కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో ప్రభుత్వానికి సీపీఐ(ఎం) బయటి నుంచి మద్దతు ఇచ్చింది. తొలిసారి ఏర్పడ్డ యూపీఏ ప్రభుత్వానికి కూడా లెఫ్ట్ పార్టీలు మద్దతు ఇచ్చాయి. ఆ సమయంలోనూ ఏచూరి కీలక పాత్రను పోషించాడు. .

స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ)లో ఆయన 1974లో చేరారు. ఆ తర్వాత ఏడాదే ఆయన పార్టీ సభ్యుడిగా మారారు. ఎమర్జెన్సీ సమయంలో అతన్ని అరెస్టు చేశారు.

ఎయిమ్స్‌కు సతారాం భౌతికకాయం దానం

సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు అప్పగించనున్నారు. ఏచూరి మృతదేహాన్ని ఎంబామింగ్ నిమిత్తం శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు మార్చురీలో ఉంచనున్నారు. అనంతరం వసంత్ కుంజ్‌లోని ఆయన ఇంటికి తరలిస్తారు. 14వ తేదీ ఉదయం 11 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయం ఎకెజి భవన్‌లో మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. ఆ తర్వాత ఏచూరి భౌతిక దేహాన్ని ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలోని అనాటమీ విభాగానికి అప్పగించనున్నారు.

బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

- సవాళ్లు ప్రతి సవాళ్లు చేసుకున్న ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీ
- కౌశిక్‌రెడ్డి ఇంటికి గాంధీ
- దాడులు చేసుకున్న ఇరు పార్టీల కార్యకర్తలు
- కౌశిక్‌రెడ్డి ఇంటి అద్దాలు ధ్వంసం
- ఎమ్మెల్యే గాంధీని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బలగం టీవి, హైదరాబాద్

ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య వివాదం చిలికిచిలికి గాలి వానలా మారింది. గురువారం గాంధీ ఇంటికి వచ్చి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తా నంటూ కౌశిక్‌రెడ్డి ఛాలెంజ్ చేసిన నేపథ్యంలో అరికెపూడి గాంధీ తన భారీ కాన్వాయ్ హైదరా బాద్ కొండాపూర్‌లోని గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ గాంధీ వర్సెస్ కౌశిక్ అనుచరులు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఇరువురు నేతలు అనుచ రులు పరస్పరం దాడులు చేసుకు న్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

కౌశిక్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లేందుకు గాంధీ ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో గాంధీ అనుచరులు గేట్లు ఎక్కి ఇంట్లోకి దూసుకువెళ్లి బీభత్సం చేశారు. అక్కడ పూలకుండీ లను బద్దలు కొట్టారు. కోడిగుడ్లు, టమాటలతో దాడి చేశారు. దీనికి ప్రతిగా కౌశిక్‌రెడ్డి అనుచరులు గాంధీ అనుచరులపై చెప్పులతో దాడి చేశారు. ఈ ఘటనలో ఇంటి అద్దాలు ధ్వంసం అయ్యాయి. కాగా పోలీసులు ఎమ్మెల్యే గాంధీ సహా ఇరువర్గాల అనుచరులను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

ఏచూరి లేకపోవడం దేశ రాజకీయాలకు తీరని లోటని : సీఎం రేవంత్‌రెడ్డి

కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సీతారాం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జాతీయ స్థాయికి ఎదిగిన అతికొద్ది మంది తెలుగువారిలో ఏచూరి గారి ప్రస్థానం ప్రత్యేకమైనదని సీఎం అభిప్రాయపడ్డారు. నాలుగు దశాబ్దాల ప్రజా జీవితంలో ఏచూరి గారు చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని, వారు లేకపోవడం దేశ రాజకీయాలకు తీరని లోటని తన సందేశంలో ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

సీతారాం ఏచూరి మరణం భారత కార్మిక లోకానికి తీరని లోటు : కేసీఆర్

సీతారాం ఏచూరి మృతి పట్ల బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. చంద్ర శేఖర్ రావు సంతాపాన్ని ప్రకటించారు. సామ్యవాద భావాలు కలిగిన ఏచూరి, విద్యార్థి నాయకుడిగా, కమ్యూనిస్టు పార్టీకి కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యునిగా అంచలంచలుగా ఎదిగి ప్రజా పక్షం వహించారని.. వారి సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. సీతారాం ఏచూరి మరణం భారత కార్మిక లోకానికి, లౌకిక వాదానికి తీరని లోటని కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఏచూరి మరణంతో శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సైబరాబాద్ సీపీ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత..

బలగం టీవి, హైదరాబాద్

సైబరాబాద్ సీపీ ఆఫీస్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అనుచరులు దాడి చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, పాడి కౌశిక్ రెడ్డి, ఇతర బీఆర్ ఎస్ నేతలు సీపీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు.అయితే ఎమ్మెల్యేలను మాత్రమే లోపలికి అనుమతిస్తామని పోలీసులు కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో గులాబీ నేతలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సీపీ లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు సిబ్బందికి ఫిర్యాదు లేఖ ఇచ్చారు. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, లేదంటే కోర్టుకు వెళ్తామని ఏసీపీ, సీఐలను సస్పెండ్ చేయాలని హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సీపీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని రెండు వేర్వేరు వాహనాల్లో తరలించారు. ఎమ్మెల్యేలు, నేతలు ఉన్న ఓ వాహనాన్ని కేశంపేట వైపు తరలించారు. మరో వాహనాన్ని షాద్‌నగర్ వైపుగా తరలించారు. అయితే, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని విడుదల చేయడంపై బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం తెలిపారు. గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేశారు. అరెస్టు చేయకపోతే కోర్టు వెళ్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసంపై ఎమ్మెల్యే గాంధీ అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే.

నాలుగేండ్ల తర్వాత సినిమా చూపిస్తాం : కౌశిక్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

ఐదేండ్ల తర్వాత బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పుడు పార్టీ మారిన నేతల సంగతి అప్పుడు చూస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడి అనంతరం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదేండ్ల తర్వాత కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, మీ భరతం పట్టడం ఖాయమని తేల్చేశారు ఇది రాసిపెట్టుకోండి. ఇప్పుడు పార్టీ మారిన వారందరికీ నాలుగేండ్ల తర్వాత సినిమా చూపిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ గూండాలు తనపై హత్యాయత్నం చేశారని కౌశిక్ రెడ్డి అన్నారు. తన ఇంటి కిటికీ అద్దాలు ధ్వంసం చేశారని చెప్పారు. ప్లాన్ ప్రకారమే గుడ్లు, టమాటాలు తీసుకొచ్చారని తెలిపారు. దాడులు చేస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. చంపే ప్రయత్నం చేస్తే.. మేమేందో కూడా చూపిస్తామన్నారు. గూండాలతో వచ్చి దాడి చేయడం ఎంతవరకు కరెక్టు అని ప్రశ్నించారు. హారతులతో స్వాగతం పలికేందుకు మిగితా 2వ పేజీలో

కేసీఆర్ పక్కన దుర్మార్గులు చేరారు : ఎమ్మెల్యే గాంధీ

బలగం టీవి, హైదరాబాద్

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి ముందు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడారు. ఇజ్జత్ లేని వాళ్లకు తాను సమాధానం చెప్పారు. తన ఇంటికి వస్తానని చెప్పిన కౌశిక్‌రెడ్డి ఇంకా రాలేదని.. మరికొద్దిసేపట్లో తానే కౌశిక్ ఇంటికి వెళ్తానని సవాల్ చేశారు. ఈ విషయంలో నాకు ఎవ్వరు అడ్డొచ్చినా ఆగే ప్రసక్తే లేదన్నారు.దేశంలోనే అతిపెద్ద అసెంబ్లీ నియోజకవర్గమైన శేరిలింగంపల్లిలో తనను ప్రజలు మూడు సార్లు గెలిపించారని తెలిపారు. ఒకవేళ పార్టీ మారినా తన నియోజవర్గ ప్రజలకు సమాధానం చెప్పుకుంటానని పేర్కొన్నారు. కేసీఆర్ పక్కన కొందరు దుర్మార్గులు చేరారని ఆరోపించారు. అలాంటి వాళ్ల వల్లే ఆయన ఎమ్మెల్యేలకు క్రమంగా దూరం అయ్యారని మిగితా 2వ పేజీలో

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట

బలగం టీవి, హైదరాబాద్

విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. విద్యుత్ కొనుగోళ్ల బకాయిల చెల్లింపులపై గత కొంత కాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే రూ.261కోట్లు చెల్లించాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్లో ఫిర్యాదు చేయడంతో విద్యుత్ కొనుగోళ్ల బిడ్‌లో పాల్గొనకుండా ఆ విభాగం అడ్డుకుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేయగా విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నిర్ణయంపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్ కొనుగోలు, అమ్మకాల్లో రాష్ట్ర ప్రభుత్వం పాల్గొనేలా అనుమతించాలంటూ గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియాను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను దసరా సెలవుల తర్వాత చేపడతామని వాయిదా వేసింది.

రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను డిస్కంలు ప్రతిరోజూ ఎక్స్ఛేంజీల్లో కొనుగోలు చేస్తుంటాయి. గురువారం డిస్కంలు బిడ్‌లలో పాల్గొనలేకపోయాయి. విద్యుత్తు కొనుగోలుకు సంబంధించిన రూ.261 కోట్ల రూపాయలను తెలంగాణ ప్రభుత్వం చెల్లించడం లేదని తక్షణమే చెల్లించాలని నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు ఛత్తీస్‌గఢ్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా తెలంగాణ డిస్కంలు విద్యుత్తు బిడ్లలో పాల్గొనకుండా గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా అడ్డుకుంది. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం హైకోర్టులో సవాల్ చేసింది.

పిటిషన్‌ను జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి విచారించారు. 2వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని అయితే ప్రస్తుతం వేయి మెగావాట్ల విద్యుత్‌ను మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి మిగితా 2వ పేజీలో

వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోన్న కాంగ్రెస్

బలగం టీవి, హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని.. రుణమాఫీ కాలేదని కొందరు.. రైతు భరోసా అందక ఇంకొందరు అన్నదాతలు ఆత్మహత్య చేసుకుంటున్నారని బీఆర్ఎస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతల పరిస్థితి ఆందోళనకరంగా మారినా.. కాంగ్రెస్ సర్కార్ మొద్దు నిద్ర వీడటం లేదన్నారు. కేసీఆర్ రైతును రాజు చేస్తే.. ఈ కాంగ్రెస్ సర్కార్ అన్నదాతల ప్రాణాలను తీస్తుందంటూ ధ్వజమెత్తారు. రైతు రుణమాఫీ బోగస్.. రైతు భరోసా కూడా బోగస్ అంటూ కేటీఆర్ నిప్పులు చెరిగారు. అటు బ్యాంకులు, ఇటు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా మిగితా 2వ పేజీలో

ఫిరాయింపు చట్టం కఠినంగా ఉండాలి

- బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ సవాళ్లు చేశారు..
- అందుకే ఫిరాయింపులు
- హైకోర్టు తీర్పును అధ్యాయనం చేయలేదు
- పీఏసీ బాధ్యతలు ప్రతిపక్షానికే ఇచ్చాం
- ఢిల్లీలో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిర్యాయింపులు అగ్గి రాజేస్తున్నాయి. ఈ అంశంపై నాలుగు నెలల్లో శాసనసభ స్పీకర్ చర్యలు తీసుకుని.. నివేదిక ఇవ్వాలని ఇప్పటికే హైకోర్టు కూడా తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా.. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అక్కడ మీడియాతో చిట్ చాట్‌లో ఈ విషయాలపై మాట్లాడారు.

ఫిరాయింపు చట్టం కఠినంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఫిరాయింపు చట్టం కఠినంగా ఉంటే.. తమ ప్రభుత్వానికి ఢోకా లేదన్నారు. తమ సంఖ్యా బలం 65గా ఉందని చెప్పుకొచ్చారు. ఎవరూ పార్టీ మారకపోవటం తమకే మేలని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్, బీజేపీలు తమ ప్రభుత్వాన్ని మూడు నెలల్లో కూల్చేస్తామంటూ సవాళ్లు చేశారని.. అందుకే ఫిరాయింపులు మొదలయ్యాయని చెప్పుకొచ్చారు. ఫిరాయింపుల చట్టం కఠినంగా ఉంటే ఆ పరిస్థితి రాదని అభిప్రాయపడ్డారు.

పార్టీ ఫిరాయించిన నేతలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును ఇంకా అధ్యాయనం చేయలేదని.. దానిపై ఇప్పుడే స్పందించలేనని రేవంత్ రెడ్డి అన్నారు. ఎవరి కోసం ప్రత్యేక రాజ్యంగం ఉండదని.. ఫిరాయింపులపై ఏ ఆదేశాలు వచ్చినా అది కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వానికి మంచిదేనని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు మైండ్ గేమ్ ఆడుతున్నారన్నారు. పీఏసీ బాధ్యతలు ప్రతిపక్షానికే ఇచ్చామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అసెంబ్లీ చివరి రోజున బీఆర్ఎస్ సభ్యుల సంఖ్యను ప్రకటించారని.. మరి అప్పుడు బీఆర్ఎస్ ఎందుకు అభ్యంతరం చెప్పలేదని ప్రశ్నించారు.

విద్యార్థి నేత నుంచి జాతీయ స్థాయి నేతగా...

- 1974లో ఎస్ఎఫ్ఐలోకి.. రెండేళ్లకే ఆల్ఇండియా అధ్యక్షునిగా ఎన్నిక
- ఆ తర్వాత సీపీఐ(ఎం)లోకి
- 2005లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక
- 2015 నుంచి సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా..

బలగం టీవి, న్యూఢిల్లీ

వామపక్ష యోధుడు, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి కన్నుమూశారు ఆయన సీపీఐ(ఎం)లో అంచెలంచెలుగా ఎదిగారు. 1974లో తొలుత ఎస్ఎఫ్ఐలో చేరిన ఆయన, రెండేళ్లకే ఆ విభాగానికి ఆల్ఇండియా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1975లో సీపీఐ(ఎం)లో చేరిన ఏచూరి 2015లో ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టారు. 2018, 2022 లోనూ పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. ఇక 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగానూ కొనసాగారు.

సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న చెన్నైలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వాస్తవ్యులు. తండ్రి సర్వేశ్వర సోమయాజుల ఏచూరి ఏపీఎస్ఆర్టీసీలో ఇంజినీర్‌గా పనిచేశారు. ఆయన తల్లి కల్పకం ప్రభుత్వ ఉద్యోగి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మోహన్ కందా ఏచూరి మేనమామ. హైదరాబాద్‌లో పెరిగిన ఏచూరి ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదువుకున్నారు. 1969లో తెలంగాణ ఉద్యమం కారణంగా ఉన్నత విద్యాభ్యాసం కోసం ఢిల్లీ వెళ్లారు. ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్‌లో ఇంటర్ పూర్తి చేసిన ఆయన సీబీఎస్ఈ పరీక్షల్లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఆర్థికశాస్త్రంలో పట్టభద్రుడయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఎంఏ ఆర్థికశాస్త్రం పూర్తిచేశారు. అక్కడే పీహెచ్‌డీ చేస్తుండగా ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని సీతారాం ఏచూరి అరెస్టయ్యారు.

సీతారాం ఏచూరి 1974లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో సభ్యుడిగా చేరారు. అప్పటి నుంచి ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత ఆయన సీపీఐ(ఎం)లో సభ్యుడిగా చేరారు. అత్యవసర పరిస్థితికి ముందు కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్లారు. అత్యవసర పరిస్థితి ఎత్తివేసిన తర్వాత జేఎన్‌యూ విద్యార్థి నాయకుడిగా సీతారాం ఏచూరి మూడుసార్లు ఎన్నికయ్యారు. 1978లో అఖిల భారత ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1985లో భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలో, 1988లో కేంద్ర కార్యవర్గంలోకి రాగా, 1992లో జరిగిన పార్టీ మహాసభల్లో ఏచూరి పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు.

2005లో బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా పని చేసిన సమయంలో ఎన్నో అంశాలను పార్లమెంట్ దృష్టికి తీసుకువచ్చారు. 2017 వరకు పెద్దలసభలో ఉన్నారు. . 2015 మార్చి 3న బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానానికి రాజ్యసభలో ఏచూరి సవరణలను ప్రతిపాదించారు. దీనిపై ఓటింగ్‌లో ఆయన సవరణ ప్రతిపాదన నెగ్గింది. రాజ్యసభ చరిత్రలోనే ఇలా జరగటం నాలుగోసారి. .

2015లో విశాఖలో జరిగిన 21వ మహాసభల్లో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా ఆయన ఎన్నికయ్యారు. 2018లో హైదరాబాద్‌లో, 2022లో కేరళలో జరిగిన 22, 23వ మహాసభల్లో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా ఏచూరీ తిరిగి ఎన్నికయ్యారు. 2004లో యూపీఏతో పొత్తు విషయంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. సీతారాం ఏచూరీ ఇంద్రాణి మజుందార్‌ను వివాహం చేసుకున్నారు. వారికి అశీష్ ఏచూరి, అఖిల ఏచూరి అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అశీష్ ఏచూరి 2021లో కరోనా కారణంగా మృతిచెందారు. అఖిల యూనివర్శిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్, యూనివర్శిటీ ఆఫ్ సెయింట్ అండ్రూస్‌లో ఆచార్యురాలుగా పనిచేస్తున్నారు. సీతారాం ఏచూరీ సీమాచిస్తీ అనే జర్నలిస్టును రెండోవివాహం చేసుకున్నారు. ఆమె ప్రస్తుతం ది వైర్ వార్తా సంస్థకు ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

ఇంగ్లీషు, హిందీ, తెలుగు, తమిళం మరియు బెంగాలీ భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఏచూరి లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్, వాట్ ఈజ్ హిందూ రాష్ట్ర, సోషలిజం ఇన్ ట్వంటీ-ఫస్ట్ సెంచరీ, కమ్యూనలిజం వర్సెస్ సెక్యులరిజం మరియు ఘృనా కీ రాజనీతి (హిందీ) వంటి పుస్తకాలను రచించారు.

హర్యానాలో 90 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆప్

బలగం టీవి, న్యూఢిల్లీ

హర్యానా ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తోంది. మొన్నటి వరకూ కాంగ్రెస్‌తో దోస్తీ కోసం చర్చలు జరిపింది. అయితే ఆ చర్చలు ఫలవంతం కాలేదు. దీంతో అన్ని స్థానాల్లోనూ ఒంటరిగానే పోటీ చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే విడతల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తూ వస్తోంది. గురువారం తన చివరి జాబితాను విడుదల చేసింది. ఏడో జాబితాలో భాగంగా ముగ్గురు అభ్యర్థులను ప్రకటించింది. దీంతో మొత్తం 90 స్థానాలకు ఆప్ అభ్యర్థులను ప్రకటించినట్లైంది.

వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోన్న కాంగ్రెస్ : కేటఆర్

(మొదటి పేజీ తరువాయి)

తిరిగినా రుణమాఫీ కాకపోవడంతో మేడ్చల్‌లో వ్యవసాయ కార్యాలయం సాక్షిగా రైతు సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని... తన తల్లికి, తనకు ఉన్న రుణం మాఫీ కాకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దగాకు బలైపోయాడని కేటీఆర్ తెలిపారు. భార్యాభర్తలిద్దరిలో ఒక్కరి కూడా రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో జగిత్యాలలో పురుగుల మందు తాగి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు రైతు సాగర్ రెడ్డి. తన పేరిట ఉన్న లక్షన్నర రుణం, తన భార్య పేరిట ఉన్న లక్షా 60 వేల రుణంలో ఏ ఒక్కరి రుణం మాఫీ అయినా గట్టెక్కుతానని గంపెడాశలు పెట్టుకుని దారుణంగా మోసపోయాడని కేటీఆర్ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చేసిన తీరని ద్రోహానికి ఇంకా ఎంతమంది రైతులు ప్రాణాలను బలిపెట్టాలి..? ఏకకాలంలో అందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ అని ఇచ్చిన మాటతప్పిన సీఎంను ఏం చేయాలి..? డిసెంబర్‌లో పెట్టిన డెడ్ లైన్ సెప్టెంబర్ దాటినా అమలుకాకపోతే దగాపడ్డ అన్నదాతలు ఇంకా ఎవరికి చెప్పుకోవాలి..? రూ. 49,500 వేల కోట్ల రుణమాఫీలో పావుశాతం కూడా చేయకుండా చేతులెత్తేసినందుకు రైతన్నలకు క్షమాపణలు చెప్పాలి రేవంత్ సర్కార్. ఇంకెంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే మీ కళ్ళు చల్లారుతాయి? రేవంత్ రెడ్డి ఢిల్లీ యాత్రలు చేయటం కాదు రాష్ట్రం లో ఏం జరుగుతుందో చూడు.. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు.. ధైర్యంగా ఉండాలని కోరుతున్నాను అని కేటీఆర్ తెలిపారు.

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కోర్టుకు తెలిపారు. కొనుగోలు చేసినా చేయకపోయినా రూ.261కోట్ల రూపాయలు చెల్లించాల్సిందేనంటూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మెలికపెట్టిందని దీన్ని కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి దృష్టికి తీసుకెళ్లామని అడ్వకేట్ జనరల్ వాదించారు. ప్రస్తుతం సీఈఆర్‌సీలో కేసు నడుస్తోందని అయినా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేసి విద్యుత్ ఎక్స్ఛేంజీలలో లావాదేవీలు నిర్వహించకుండా అడ్డుకుందని ఏజీ కోర్టుకు వివరించారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా పడుతుండటంతో హైడల్ విద్యుత్ ఉత్పత్తి అవసరాలకు తగిన విధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. బకాయి పడిన మొత్తంలో 25శాతం చెల్లించాలని ఫిబ్రవరిలో సూచించామని అయినా చెల్లించడానికి ముందుకు రాలేదని ఛత్తీస్?గఢ్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా తీసుకున్న నిర్ణయంపై స్టే విధిస్తూ విద్యుత్ ఎక్స్ఛేంజీలో కొనుగోలు, అమ్మకాలకు తెలంగాణ ప్రభుత్వానికి అవకాశం కల్పించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

రాజీనామాకు సిద్ధం: మమతా బెనర్జీ

బలగం టీవి, కోల్‌కతా

ప్రజల కోసం తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. హత్యకు గురైన ఆర్‌జి కార్ ఆసుపత్రి డాక్టరుకు న్యాయం జరగాలని తాను కూడా కోరుకుంటున్నానని ఆమె తెలిపారు. ఆర్‌జి కార్ ఆసుపత్రి ప్రతిష్టంభన నేడు ముగిసిపోతుందని ఆశించిన బెంగాల్ ప్రజలకు క్షమాపణ చెబుతున్నానని గురువారం విలేకరుల సమావేశంలో మమత తెలిపారు. సచివాలయానికి వాళ్లు(డాక్టర్లు) వచ్చారు కాని సమావేశంలో మాత్రం కూర్చోలేదని అన్నారు. విధులకు తిరిగి వెళ్లాలని వారిని అర్థిస్తున్నానని అన్నారు. గత మూడు రోజులుగా తాను సదుద్దేశంతో తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ చర్చలు జరిపేందుకు మెడికోలు నిరాకరించారని, ప్రజల కోసం రాజీనామా చేయడానికి కూడా తాను సిద్ధమని మమత ప్రకటించారు.

సవాళ్లు.. ప్రతి సవాళ్లు.. అరెస్టులు

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రంలో ఇద్దరు ఎమ్మెల్యేలు మధ్య వివాదం పొలిటికల్ హీట్‌ను రాజేసింది. పాడి కౌశిక్ రెడ్డి వర్సెస్ ఎంఎల్ఎ గాంధీ మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో మాటల తూటాలు పేలాయి. ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. కౌశిక్ రెడ్డి ఓ బ్రోకర్ అని.. దమ్ముంటే బయటికి రా అంటూ బిఆర్ఎస్ ఎంఎల్ఎ ఇంటికి వెళ్లి మరీ అరికెపూడి గాంధీ సవాల్ చేశారు. ఈ క్రమంలో కౌశిక్ ఇంటిపై కార్యకర్తలు, అనుచరులు టమోటాలు, గుడ్లతో దాడికి దిగారు.ఈ ఉద్రిక్తతల మధ్యే ఎమ్మెల్యేల అరికెపూడి గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఇద్దరు ఎమ్మెల్యే మధ్య సవాళ్ల దుమారం రేగిన నేపథ్యంలో గురువారం ఉదయం నుంచే ఇద్దరు ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అరికపూడి ఇంటికి వెళ్లి బిఆర్ఎస్ కండువా కప్పుతానని ఆ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సవాల్ విసిరాలు. దాన్ని స్వీకరిస్తున్నట్లు అరికపూడి గాంధీ అన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మరోవైపు పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కొండాపూర్‌లోని ఆయన నివాసం నుంచి బయటకు రాకుండా పోలీసులు బందోబస్తూ ఏర్పాటు చేశారు.

సవాల్ పై ఎమ్మెల్యే అరికపూడి గాంధీ స్పందించారు. బాత్రూమ్‌లో ఉండి డీలింగ్‌లు నడిపే ప్రతి ఒక్కడూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీ ఇంటికొస్తా ఇంటి మీద జెండా ఎగరేస్తా అంటే ఖాళీగా ఉన్నామా..? అని కౌశిక్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కేసీఆర్ లాంటి పెద్ద మనుషులు అలాంటి కామెంట్స్ చేస్తే స్వాగతించేవాడినని, తనతోటి శాసనసభ మిత్రులు అడిగినా బదులిచ్చేవాడినని తెలిపారు. ఇలాంటి వారు నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకుంటామా..? అని ప్రశ్నించారు. నన్ను గెలిపించకుంటే చచ్చిపోతా అని భయపెట్టి ఎమ్మెల్యేగా గెలిచిన వారికి తన గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. నేనే మీ ఇంటికి వస్తా తట్టుకునే దమ్ముందా..? అని- అరికెపూడి గాంధీ సవాల్ విసిరారు.

కోట్లకు అమ్ముడుపోవడం, భూ పంచాయితీలో సెటిల్‌మెంట్ల కోసమే అరికపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరారని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ బి.ఫాంపై గెలిచి కాంగ్రెస్‌లో ఎలా చేరతావని నిలదీశారు. ధైర్యం ఉంటే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. అరికపూడి గాంధీ బిఆర్ఎస్‌లోనే ఉంటే తెలంగాణ భవన్‌కు రావాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచి ఇద్దరం కేసీఆర్ వద్దకెళదామని చెప్పారు.

అనంతరం గాంధీ కౌశిక్‌రెడ్డి ఇంటి వద్దకు ఇరువర్గాల కార్యకర్తలు దాడులు చేసుకున్నారు. దాంతో ఎమ్మెల్యే గాంధీని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యేకే రక్షణనే లేదని అన్నారు. సామాన్య ప్రజలకు ప్రభుత్వం రక్షణకు ఎలా ఇస్తుంది? అని ప్రశ్నించారు. తనను హత్య చేయడానికి తన ఇంటి వద్దకు వచ్చారని ఆరోపించారు. శుక్రవారం 11 గంటలకు బీఆర్ఎస్ పార్టీ తడాఖా చూపిస్తామంటూ కౌశిక్ రెడ్డి సవాల్ విసిరారు.అరెకపూడి గాంధీ చేసిన చర్యకు ప్రతిచర్య ఉంటుందిన్నారు. అరెకపూడి గాంధీ కృష్ణా జిల్లా నుంచి హైదరాబాద్‌కు వచ్చారన్న కౌశిక్, తాను నిఖార్సైన తెలంగాణ బిడ్డనని తెలిపారు.

తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నార్సింగి పీఎస్ నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మరోసారి మాట్లాడుతూ తనను ఆహ్వానిస్తేనే కౌశిక్ రెడ్డి నివాసానికి వెళ్లానని తెలిపారు. ఇంటిముందు కూర్చుంటే తమపై కౌశిక్‌రెడ్డి కుటుంబం దాడి చేసిందని ఆరోపించారు. కౌశిక్ భార్య ఇంటి పైనుంచి పూల కుండీలు తమపై విసిరేశారని అన్నారు. అదే బీఆర్ఎస్ విధానమైతే ప్రజలకు క్షమాపణ చెప్పాలని, కాకుంటే కౌశిక్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని గాంధీ డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. ఇదేం ప్రజాపాలన? ఇదేం ఇందిరమ్మ రాజ్యం? అని హరీశ్ రావు ప్రశ్నించారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డికి ఇంటికి వెళ్లిన బీఆర్ఎస్ నేతలు ఆయనను పరామర్శించారు. అరెకపూడి గాంధీ అనుచరుల దాడిలో ధ్వంసమైన పరిసరాలను పరిశీలించారు. పోలీసులే ఎస్కార్టు ఇచ్చి మరీ అరికెపూడిని తీసుకువచ్చారన్న హరీశ్‌రావు ఇదేనా ప్రజా పాలన అంటే అని మండిపడ్డారు. గాంధీని ఎందుకు హౌస్ అరెస్టు ఎందుకు చేయలేదని నిలదీశారు.

సైబరాబాద్ సీపీ కార్యాలయం వద్ద ఆందోళన

కౌశిక్‌రెడ్డి ఇంటి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైబరాబాద్ సీపీ కార్యాలయానికి వెళ్లారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల వాహనాలను పోలీసులు అడ్డుకున్నారు. తీవ్రంగా స్పందించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమను అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీపీ కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మాత్రమే సీపీ కార్యాలయంలోకి పోలీసులు అనుమతించగా సైబరాబాద్ జాయింట్ సీపీ డోయల్ డేవిస్‌కు వారు ఫిర్యాదు చేశారు. అరెకపూడి గాంధీ అనుచరులు రెచ్చిపోయి దాడి చేస్తుంటే నిలువరించలేని ఏసీపీ, సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేసే వరకూ కదలబోమంటూ సైబరాబాద్ సీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సుమారు రెండు గంటలపాటు ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహా మిగతా నేతలను బలవంతంగా వ్యాన్ ఎక్కించి రెండు వాహనాల్లో వేర్వేరు మార్గాల్లో తరలించారు. కొంత మంది బీఆర్ఎస్ నేతలను కేశంపేట వైపు, మరికొంత మంది నాయకుల్ని షాద్‌నగర్ వైపు తీసుకెళ్లారు.అరెస్ట్ సమయంలో తోపులాటలో హరీశ్‌రావు చేతికి గాయం తగిలింది.

పోలీసులు రెండు వాహనాల్లో వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు ఉన్న వాహనాన్ని శ్రీశైలం రోడ్డుపైపు మళ్లించారు. కడ్తాల్ మీదుగా కల్వకుర్తికి తరలించినట్టు తెలిసింది. కేశంపేట మండలం కొత్తపేట వద్ద వాహనానికి అడ్డుగా బీఆర్ఎస్ శ్రేణులు బైఠాయించాయి. కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి చేశారు.

ఈ సందర్భంగా పోలీసుల తీరుపై హరీశ్‌రావు మండిపడ్డారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయమన్నామని.. 307 నమోదు చేస్తే స్టేషన్ బెయిల్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఏసీపీ, సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం పీఎస్‌కు వెళ్తే తమను అరెస్టు చేశారని ఆరోపించారు. అరెస్ట్ చేసి ఎక్కడెక్కడో తిప్పుతున్నారన్నారు. మమ్మల్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలియదన్నారు. మేం ఏమైనా ఉగ్రవాదులమా? అంటూ ప్రశ్నించారు. మాజీ మంత్రినైనా తనతో ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. నా ఎడమ భుజం బాగా నొప్పి వస్తుందన్నారు. పోలీసులు నా చేతిని బలంగా లాగడంతో నొప్పి పెరిగిందన్నారు.

మరో వైపు గచ్చిబౌలి డీసీపీ ఆఫీస్‌కు కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేరుకున్నారు. గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని మాజీ మంత్రి సబితా అన్నారు. సీఎం బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దాడికి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. అరికెపూడి గాంధీపై హత్యా యత్నం కేసు నమోదు చేయాలన్నారు.

నాలుగేండ్ల తర్వాత సినిమా చూపిస్తాం : కౌశిక్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధంగా ఉంటే.. తమపై రాళ్ల దాడులు చేస్తారా అన్నారు. రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యేకే రక్షణ లేదని, సామాన్య ప్రజలకు ప్రభుత్వం రక్షణ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. ప్రజా పాలన అంటే ఇదేనా రేవంత్ రెడ్డి అని నిలదీశారు. కాంగ్రెస్ గూండాల దాడికి రేపు ప్రతిచర్య ఉంటుందన్నారు.ప్రతిపక్షానికి పీఏసీ ఇవ్వడం ఆనవాయితీ అని, తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షానికి ఇచ్చామని పేర్కొన్నారు కౌశిక్ రెడ్డి.. పీఏసీ కోసం హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ దాఖలు చేసిన నామినేషన్లు ఏమయ్యాయని రేవంత్ ను నిలదీశారు. నామినేషన్ దాఖలు చేయని అరికెపూడి గాంధీకి దొంగచాటున పీఏసీ చైర్మన్ గిరి ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

అరికెపూడి గాంధీ మాట్లాడిన మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు.. గతంలో మైనంపల్లి హన్మంత్ రావు అల్వాల్‌లో మీటింగ్ పెట్టి ఇదే విధంగా కేటీఆర్‌ను దూషించారని, ఫలితంగా ఆయన 50వేల ఓట్ల మెజార్టీతో ఓడిపోయారని గుర్తు చేశారు. రేపు నీ నియోజకవర్గంలో నీకు కూడా అదే గతి పడుతుందని అరికెపూడిని హెచ్చరించారు.. ఉప ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో మా దమ్మేందో చూపిస్తామన్నారు.

చీరలు, గాజుల సంస్కారం నేర్పిందే రేవంత్‌రెడ్డి అని కౌశిక్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి నేర్పిన సంస్కారాన్ని తాను అనుసరించినట్లు పేర్కొన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరిన రోజు కాంగ్రెస్‌లో ఉన్నది ఐదుగురే అని చెప్పారు. ఐదుగురు ఎంఎల్ఎలే ఉంటే బీఆర్ఎస్‌లోకి పదిమందిని తానెలా తీసుకెళ్తానని అడిగారు. తనకు బీఆర్ఎస్‌తో పంచాయితీ లేదని గాంధీ అంటున్నారని, తనతోనే తన పంచాయితీ అని చెబుతున్నారని తెలిపారు. ఆయనకు, తనకు ఏమన్నా భూతగాదాలు ఉన్నాయా..? అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో తన్నుకోవడం పెద్ద విషయం కాదా..? అని పేర్కొన్నారు. ఇద్దరం ఒకరికొకరు తన్నుకోవచ్చని కానీ ప్రజాస్వామ్యంలో మంచిది కాదు కదా.. అని హితవు పలికారు.

కేసీఆర్ పక్కన దుర్మార్గులు చేరారు : ఎమ్మెల్యే గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. మర్యాద లేని వాళ్లను చేర్చుకుని పార్టీని భ్రష్టు పట్టించారని ఫైర్ అయ్యారు. కౌశిక్‌రెడ్డి లాంటి బ్రోకర్ వచ్చి తన ఇంటిపై జెండా ఎగరేస్తానంటే చేతులు ముడుచుకు కూర్చోలేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటివద్దకు చేరుకున్న ఎమ్మెల్యే గాంధీ.. దమ్ముంటే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంట్లో నుంచి బయటకు రావాలని సవాల్ చేశారు. బయటకు వచ్చే వరకు తానిక్కడే ఉంటానన్నారు. కౌశిక్ రెడ్డిని తెలంగాణ ప్రజలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. నా ఇంటికి కౌశిక్ రెడ్డి రాలేకపోయాడు...నాకు దమ్ముంది కాబట్టి..నేను అతని ఇంటికి వచ్చా అని అన్నారు గాంధీ . కౌశిక్ రెడ్డికి దమ్మూధైర్యం లేదు. పిరికోడు.. నేను పోలీసులతో రాలేదు..నువ్వే పోలీసులను అడ్డు పెట్టుకున్నావ్. కౌశిక్ రెడ్డి పెద్ద బ్రోకర్.. ఒక కోవర్డ్. కౌశిక్ రెడ్డి దొంగ అని కేసీఆర్ గ్రహించలేకపోయారని విమర్శించారు గాంధీ.

ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదా..? : కేటఆర్

బలగం టీవి, హైదరాబాద్

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పట్టపగలే ఎమ్మెల్యేపై హత్యాయత్నామా అని ప్రశ్నించారు. మన రాష్ట్రం ఎటు పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్షన్, రౌడీ రాజకీయాలకు తెలంగాణను అడ్డాగా మార్చేస్తుంటే బాధగా ఉందన్నారు. కౌశిక్ రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచి అరికెపూడి గాంధీ గూండాలతో దాడి చేయిస్తారా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమ్మెల్యేలకు కూడా రక్షణ లేకపోవడమేనా అని నిలదీశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై న్యాయపరంగా పోరాడుతున్నందునే కౌశిక్ రెడ్డిని టార్గెట్ చేశారన్నారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించిన దాడేనని ఆరోపించారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇలాంటి ఉడుత ఊపుల దాడులకు బెదిరేది లేదని స్పష్టం చేశారు. ఇంతకు మించిన ప్రతిఘటన తప్పదంటూ కేటీఆర్ హెచ్చరించారు.

ముగిసిన కేంద్ర బృందం పర్యటన

బలగం టీవి, ఖమ్మం

భారీవర్షాలు, వరదలతో నష్టపోయిన ఖమ్మం జిల్లాలోని ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర విపత్తు నిర్వహణ బృందాల పర్యటన ముగిసింది. రెండోరోజూ రెండు బృందాలుగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధితుల కష్టాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలోని కేంద్ర బృందం ముగ్గురు చొప్పున రెండుబృందాలుగా జిల్లాలో పర్యటించింది.

మొదటి బృందం ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి రాజీవ్ గృహకల్ప, ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు, బొక్కలగడ్డ ప్రకాశ్‌నగర్, మున్నేరు బ్రిడ్జి, మోతీనగర్‌లో పర్యటించింది. మున్నేరు వరద ఉధృతితో కకావికలమైన బాధిత కాలనీల వాసులు కేంద్ర బృందం ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. పలు కాలనీల్లో వరద మిగిల్చిన కష్టాలను అధికారులకు వివరిస్తూ కొంతమంది మహిళలు కన్నీటిపర్యంతమయ్యారు. సర్వం కోల్పోయాయమని తమను ప్రభుత్వాలే ఆదుకోవాలని గోడు వెళ్లబోసుకున్నారు. ఖమ్మం గ్రామీణం మండలం దానవాయిగూడెం తల్లంపాడు- తెల్దారుపల్లి,తనగంపాడు, ఖమ్మం పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో పర్యటించి వరదల కారణంగా జరిగిన నష్టాన్ని రెండో బృందం పరిశీలించింది. ముంపు ప్రాంతాల్ల

న్యాయం చేయాలంటూ రోడ్డెక్కిన విద్యార్థినిలు..

బలగం టీవీ, తంగళ్ళపల్లి

పీఈటి వేధింపులు తట్టుకోలేక గురువారం విద్యార్థులు రోడ్డెక్కి నిరసన తెలిపారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ ట్రైబల్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ పీటి జోష్ణ ఇబ్బందులు పెడుతున్నదని, వాటిని భరించలేక సిరిసిల్ల – సిద్దిపేట ప్రధాన రహదారి పై ధర్నాకు దిగినట్టు విద్యార్థినులు తెలిపారు. పి టి జోష్ణను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పీఈటీ జోష్ణ తమను ఇష్టం వచ్చినట్లుగా బూతులు తిడుతూ, ఎక్కడ పడితే అక్కడ కొడుతుందని మండిపడ్డారు. క్లాస్ సమయంలో కూడా వేధిస్తోందని, స్నానం చేస్తుంటే బట్టలు లేకుండా వీడియోలు తీస్తూ, రక్తం వచ్చేలా కొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ప్రిన్సిపాల్‌తో పాటు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎంఈవో, పోలీసులు విద్యార్థులకు నచ్చజెప్పినా వినకపోవడంతో డీఈఓ రమేష్ కుమార్ పి టి జ్యోష్ణను సస్పెండ్ చేయడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

నిబంధనలకు అనుగుణంగా అనుమతివ్వాలి

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..**

బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల

నియమ, నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురు వారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమల, ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటిదాకా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? అనుమతి కోసం ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి?. ఏ ఏ కారణాలతో నిలిచిపోయాయో ఆయా శాఖల ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి వివిధ రకాల 45 పరిశ్రమలకు అనుమతి ఇచ్చామని కలెక్టర్ దృష్టికి జీఎం ఇండస్ట్రీస్ గణేష్ రాం తీసుకెళ్లారు. టీ ప్రైడ్ కింద సబ్సిడీ రుణాలు మంజూరుకు ఎస్సీలు 36, ఎస్టీలు 17, దివ్యాంగులు 2 ఎంపిక కాగా, వారికి ఈ నెల 17వ తేదీన ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా అర్హత పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పీఎం విశ్వకర్మ స్కీమ్ పై సమీక్షించారు.ఈ సమావేశంలో ఇండస్ట్రీస్ ఏడీ భారతి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఎల్డీఎం మల్లికార్జున్, డీటీఓ లక్ష్మణ్, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్ రెడ్డి, సెస్ ఎండీ రవీందర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, డీటీసీపీఓ అన్సార్, లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, డీటీడీఓ జనార్ధన్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవాన్ని నిర్వహించాలి..

- **ఈ నెల 16న వేములవాడలో వినాయక నిమజ్జనం**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

బలగం టీవీ ,వేములవాడ:

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ నెల 16న వేములవాడలో వినాయక నిమజ్జన ఉత్సవాన్ని నిర్వహించనుండగా, వేములవాడ రాజ రాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో చేస్తున్న ఏర్పాట్లను గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆయా శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ నిమజ్జ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. న్యాయస్థానం, పోలీస్ అధికారుల సూచనలు మండపాల నిర్వాహకులు, యువత, ప్రజాప్రతినిధులు పాటించి, సహకరించాలని, ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని అన్నారు.పోలీస్ శాఖ నిబంధన మేరకు రెండు సౌండ్ బాక్స్ లు పెట్టుకోవాలని, ఆన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్, సెస్, మత్స్య, పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై చర్చించారు. కావాల్సిన క్రేన్స్, జేసీబీలు, విద్యుత్ దీపాలు, నీటి సదుపాయం కల్పించాలని కమిషనర్ ను,సెస్ అధికారులు విగ్రహాలు వెళ్లే దారిలో విద్యుత్ తీగలు ఎత్తు పెంచి ఇబ్బంది కలగకుండా చూడాల ని ఆదేశించారు. అన్ని మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా నిర్ణీత సమయానికి తరలించి, సహకరించాలని కోరారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో సిబ్బందిని నియమించి లైఫ్ జాకెట్లు సమకూర్చాలని, ఎక్సైజ్, అగ్ని మాపక శాఖలు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్ పర్సన్ రామ తీర్థపు మాధవి, వైస్ చైర్మన్ బింగి మహేష్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, రాజ రాజేశ్వర స్వామి దేవాలయం ఈఓ వినోద్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, తహసిల్దార్ మహేష్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్..

బలగం టీవీ,తంగళ్ళపల్లి:

తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని గిరిజన సంక్షేమ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం సందర్శించారు. పీఈటీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ రోడ్డుపై విద్యార్థులు ఆందోళన చేయగా, కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ రమేష్ కుమార్ చేరుకొని, విద్యార్థులతో మాట్లాడారు. వెంటనే పీఈటీని తొలగించారు. అనంతరం కలెక్టర్ విద్యాలయానికి చేరుకొని వారితో మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్, ప్రిన్సిపాల్ కు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఇక్కడ విద్యాలయం ప్రత్యేక అధికారి, డీసీఓ రామకృష్ణ, ప్రిన్సిపాల్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల చేయూత పై హర్షం

బలగం టీవీ ,తంగళ్ళపల్లి

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులకు నెతన్న చేయూత, భరోసా లాంటి కార్యక్రమాల ద్వారా రుణమాఫీ చేసినందుకు సంతోషకరమన్నారు.సిరిసిల్ల చేనేత కార్మికులకు బతుకమ్మ చీరలు ఆర్డర్లు ఇవ్వడం వలన ఇక్కడి కార్మికులకు మరింత ఉపాధి దొరుకుతుందని చేనేత కార్మికులు అదేర్య పడద్దని ఆత్మహత్యలు చేసుకోవడం లాంటివి చేయకూడదని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటూ నిరంతరం ఉపాధి కల్పిస్తుందని అన్నారు.గత పాలక ప్రభుత్వం మాదిరిగా చెప్పేది ఒకటి చేసేది ఒకటి లా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని హైదరాబాదులో ప్రారంభించారని దీని ద్వారా మరింత ఉపాధి దొరుకుతుందని అన్నారు.ఈ సందర్భంగా పద్మశాలి సంఘం సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి కి జౌళీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి కృతజ్ఞతలు తెలిపారు.

బాలికపై లైంగికదాడి.. దోషికి మరణశిక్ష

బలగం టీవీ , హైదరాబాద్

సంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు గురువారం సంచలన తీర్పు వెలువరించింది. పోక్సో కేసు దోషి గఫార్ఖాన్‌కు మరణశిక్ష విధించింది. ఆరేళ్ల బాలికపై లైంగికదాడి చేసిన కేసులో కోర్టు విచారణ జరిపింది. దోషికి మరణశిక్షే సరైన నిర్ణయమని తీర్పు వెలువరించింది. అంతేకాదు బాలిక కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే బిహార్‌కు గఫార్ ఖాన్(56) అనే అనే వ్యక్తి ఉపాధి నిమిత్తం సంగారెడ్డికి వచ్చారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య కంపెనీ పక్కన లేబర్ రూమ్‌లో నివాసం ఉంటున్నాడు.

అయితే అదే ఏరియాలో ఉంటోన్న ఆరేళ్ల బాలికపై కన్నేశాడు. కూల్ డ్రింక్ కొనిస్తానని చెప్పి పాపను తీసుకెళ్లాడు. అందులో మద్యం కలిపి ఇచ్చాడు. అనంతరం డ్రింక్ తాగించి పత్తి చేనులోకి తీసుకెళ్లి పాపపై లైంగికదాడి చేశాడు. అనంతరం ఎవరికైనా చెబుతుందేమోనని భయంతో గొంతు నులిమి హత్య చేశాడు. దీనిపై స్థానిక పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. చివరకు తుది విచారణ జరిపిన కోర్టు ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది.

రాహుల్ గాంధీ ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదు

- **జన్ సురాజ్ చీఫ్, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్**

బలగం టీవీ , న్యూఢిల్లీ

రాహుల్ గాంధీ ఏ సమయంలో ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదని జన్ సురాజ్ చీఫ్, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ అన్నారు. కొద్ది నెలల కిందట కుల గణనకు అనుకూలంగా మాట్లాడిన రాహుల్ రిజర్వేషన్లను పెంచాల్సిన అవసరం ఉందని అన్నారని గుర్తు చేశారు. అయితే అమెరికా పర్యటనలో రాహుల్ ప్రస్తుతం రిజర్వేషన్లు తొలగించడం గురించి మాట్లాడుతున్నారని అన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసేవరకూ రాహుల్ నిత్యం కుల గణన చేపట్టాలని, అవసరమైతే కోటా పరిమితిని పెంచాలని అన్నారని, ఇప్పుడాయన ఎందుకు రిజర్వేషన్లు తొలగించాలని మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ప్రశాంత్ కిషోర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రకటనపై కాంగ్రెస్ నేతలు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొమరమ్మ, మొగిలయ్య, చంద్రబోస్‌లకు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం

- **నేడు రవీంద్రభారతి లో స్పీకర్, మంత్రుల చేతుల మీదుగా అవార్డు ప్రదానం**
- **అవార్డు గ్రహితలకు నగదుతో పాటు.. మెమోంటోలతో సత్కారం**

బలగం టీవీ, హైదరాబాద్:

తెలంగాణ మట్టి వాసనను, బంధాలు, బంధుత్వాల విలువ తెలిపిన వేణు యెల్ధండి దర్శకత్వం వహించిన 'బలగం' సినిమా లో వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన బలగం కొమరమ్మ, మొగిలయ్యలు క్లైమాక్స్ సాంగ్ పాడి ఎంత పాలపులర్ అయ్యారో అందరికి తెలిసిన విషయమే. జనాన్ని ఆ పాటతో కంటతడి పెట్టించారు. వేణు యెల్ధండి బలగం సినిమాను అద్భుతంగా తెరకెక్కించి చరిత్రలో నిలిచిపోయేలా చేశారు. ఇప్పటికే ఈ సినిమాకు 100 అంతర్జాతీయ అవార్డులు, జాతీయ అవార్డులు సొంతం చేసుకుంది. తాజాగా ఫీలిం పేర్ అవార్డను కూడా సొంతం చేసుకుంది. బలగం సినిమాలో క్లైమాక్స్ సాంగ్ పాడిన శారదగాళ్లు... బలగం కొమరమ్మ, మొగిలయ్యకు తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పొన్నం సత్తయ్యగౌడ్ 14 వర్ధంతి సందర్భంగా పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం 2024 అవార్డులను ప్రకటించారు. ఆస్కార్ అవార్డు గ్రహిత, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ కు, బలగం సినిమా క్లైమాక్స్ సింగర్స్ బలగం కొమురమ్మ, మొగిలయ్యలకు ఈ అవార్డులను కమిటీ ప్రకటించింది. పురస్కార గ్రహితలకు ఒక్కొక్కరికి రూ.51 వేల నగదుతో పాటు మోమోంటో, శాలువాలతో సత్కరిస్తారు. ఈ నెల 13న శుక్రవారం(నేడు) సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణా శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దుళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్టారావు, తెలంగాణ పైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు. ఈ అవార్డును 2022 లో నాళశ్వరం శంకర్(రచయిత), ఒగ్గుకథ ధర్మయ్యకు 2023 లో ప్రముఖ కథ రచయిత నలిమెల భాస్కర్, ఆరుణోదయ విమలక్కకు అందించారు. 2024 లో అస్కార్ అవార్డు గ్రహిత చంద్రబోస్ కు, బలగం కొమురమ్మ, మొగిలయ్యలకు అందించనున్నారు. తెలంగాణ లో శారదగాళ్ల కళలు బలగం సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా బలగం కొమురమ్మ, మొగిలయ్యతో మరోసారి చర్చకు వచ్చాయి. ఎక్కడో మారుమూల గ్రామానికి చెందిన ఈ కళకారులు అస్కార్ అవార్డు గ్రహితతో సమానంగా ఈ అవార్డు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం అవుతుంది. ఈ అవార్డు తెలంగాణ కళలకు ఉన్న గొప్ప తనం, విలువను తెలుపుతుందని కళాభిమానులు పేర్కొంటున్నారు. అవార్డు గ్రహితలకు పలువురు అభినందనలు తెలిపారు.

తిరుపతిలో ఘోర రోడ్డు ప్రమాదం..

- **నలుగురు మృతి**

బలగం టీవీ , న్యూఢిల్లీ

తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చంద్రగిరి మండలం భాకరాపేట కనుమ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన ఓ కంటైనర్ అదుపుతప్పి కారు, బైక్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.ఈ ప్రమాదానికి కారణమైన కంటైనర్.. టమాటా లోడుతో చెన్నైకి వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

సరికొత్త గరిష్ఠానికి చేరుకున్న స్టాక్ మార్కెట్ సూచీలు

బలగం టీవీ , ముంబై

భారత స్టాక్ మార్కెట్ భారీ లాభాల్లో ముగిసింది. సెన్సెక్స్ 1,439 పాయింట్లు లాభపడి 82,962 వద్ద... నిఫ్టీ 470 పాయింట్లు ఎగిసి 25,388 వద్ద స్థిరపడింది. 2,228 స్టాక్స్ లాభాల్లో... 1,564 స్టాక్స్ నష్టాల్లో ముగియగా, 103 స్టాక్స్‌లో ఎలాంటి మార్పు లేదు. సెన్సెక్స్ ఓ సమయంలో 1,500 పాయింట్లు లాభపడింది. సెన్సెక్స్, నిఫ్టీ గురువారం ఆల్ టైమ్ గరిష్ఠాన్ని తాకాయి. దీంతో మొదటిసారి సెన్సెక్స్ 83 వేల పాయింట్లను దాటింది. అయితే చివరకు ఈ మార్కుకు కాస్త దిగువన ముగిసింది. మార్కెట్ ర్యాలీతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6.6 లక్షల కోట్లు పెరిగి రూ.467.36 లక్షల కోట్లకు చేరుకుంది.నిఫ్టీ-50 స్టాక్స్‌లో హిండాల్కో, భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ లాభాల్లో ముగిశాయి. నెస్లే మాత్రమే నష్టాల్లో ముగిసింది. అన్ని రంగాలు కూడా ఈ రోజు లాభాల్లోనే ముగిశాయి. మెటల్స్, ఆటోమొబైల్స్, క్యాపిటల్ గూడ్స్, టెక్నాలజీ, పవర్ రంగాలు 2 శాతం నుంచి 4 శాతం వరకు లాభపడ్డాయి. మిడ్ క్యాప్ సూచీలు 1 శాతానికి పైగా లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీలు 0.8 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ మెటల్ 3 శాతానికి పైగా లాభపడింది.

4వ రోజూ అదే సీన్..

బలగం టీవీ, న్యూఢిల్లీ

ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్ మధ్య ఢిల్లీలోని గ్రేటర్ నోయిడాలో జరగాల్సిన ఏకైక టెస్టు మ్యాచ్ నాలుగో రోజూ వర్షార్పణమైంది. దాంతో నాలుగవ రోజు కూడా మ్యాచ్‌ను రద్దు చేశారు. వర్షం వల్ల పిచ్ చిత్తడిగా మారడంతో.. ఆటను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. నాలుగు రోజులు కూడా ఒక్క బంతిని బౌల్ చేయలేదు. కనీసం మ్యాచ్‌కు చెందిన టాస్ కూడా పడలేదు. నిరంతరాయంగా వర్షం కురుస్తున్న కారణంగా కివీస్‌తో జరగాల్సిన టెస్టు మ్యాచ్ నాలుగవ రోజును రద్దు చేసినట్లు ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. అయితే అయిదో రోజు ఉదయం 8 గంటలకు టాస్ వేయనున్నట్లు చెప్పారు.

టెస్టు క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు మాత్రమే ఒక్క బంతి కూడా పడకుండా రద్దు అయ్యాయి. 1998లో కివీస్, ఇండియా మధ్య జరిగిన టెస్టు మ్యాచ్ అలాగే ముగిసింది. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా కివీస్, ఆఫ్ఘన్ మ్యాచ్ జరగాల్సి ఉంది. ఈ మ్యాచ్ ముగిసిన తర్వాత కివీస్ జట్టు శ్రీలంక టూర్‌కు వెళ్తుంది. ఆ తర్వాత అక్టోబర్‌లో ఇండియాతో మూడు టెస్టులు ఆడుతుంది.

ఆసియా హాకీ టోర్నీలో సెమీస్‌కు భారత్

- **దక్షిణ కొరియాపై భారత్ 3-1 గోల్స్ తేడాతో విజయం**

బలగం టీవీ, న్యూఢిల్లీ

చైనాలోని హులున్‌బుర్‌లో జరుగుతున్న ఏషియన్ ఛాంపియన్స్ ట్రోఫీ హాకీలో భారత జట్టు సెమీస్‌లోకి ప్రవేశించింది. భారత జట్టు 3-1 గోల్స్ తేడాతో దక్షిణ కొరియాపై విజయం సాధించింది. భారత్‌కు ఇది వరుసగా నాలుగవ విజయం. ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత్, ఏసీటీ టోర్నీలో చైనా, జపాన్, మలేషియాపై విజయాలు నమోదు చేసింది. కొరియాతో జరిగిన మ్యాచ్‌లో అరైజీత్ సింగ్ హుందాల్ 8వ నిమిషంలో, హర్మన్‌ప్రీత్ సింగ్ 9వ, 43వ నిమిషాల్లో గోల్స్ చేశారు. కొరియా తరపున జీ హున్ యాంగ్ ఓ గోల్ చేశాడు. పెనాల్టీ కార్నర్‌ను అతను గోల్‌గా మలిచాడు. చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు శనివారం పాకిస్థాన్‌తో తలపడనున్నది. టాప్ నాలుగు జట్లు సెమీస్‌లో పోటీపడుతాయి.

భారత్‌తో టెస్టు సిరీస్‌కు బంగ్లాదేశ్ జట్టు ఇదే..

బలగం టీవీ, న్యూఢిల్లీ

భారత్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు బంగ్లాదేశ్ జట్టును ప్రకటించారు. గాయపడ్డ షోరిఫుల్ ఇస్లామ్ స్థానంలో వికెట్ కీపర్, బ్యాటర్ జకీర్ అలీని ఎంపిక చేశారు. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్ షోరిఫుల్ రెండు మ్యాచ్‌లకు దూరంకానున్నాడు. గత నెలలో పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టు సమయంలో.. అతనికి గజ్జల్లో నొప్పి వచ్చింది. పాక్‌కు వెళ్లిన 16 మంది బృందంలో.. ఒక్క షోరిఫుల్ మాత్రమే మిస్ అవుతున్నాడు. ఇటీవల ముగిసిన ఆ సిరీస్‌లో 2-0 తేడాతో బంగ్లాదేశ్ సంచలన విజయం నమోదు చేసిన విషయం తెలిసిందే.

బంగ్లాదేశ్ తరపున 17 అంతర్జాతీయ టీ20ల్లో షోరిఫుల్ ఆడాడు. 49 ఫస్ట్ క్లాస్ గేమ్స్ లో 41.47 సగటుతో అతను 2862 రన్స్ చేశాడు. వాటిల్లో నాలుగు సెంచరీలు, 19 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. సెప్టెంబర్ 19వ తేదీ నుంచి బంగ్లా, భారత్ మధ్య చెన్నైలో టెస్టు సిరీస్ ప్రారంభం కానున్నది. రెండో టెస్టు సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్‌లో జరగనున్నది. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ జరగనున్నది. ప్రస్తుతం ఇండియా, ఆస్ట్రేలియా జట్లు ఆ ర్యాంకింగ్స్‌లో టాప్‌లో ఉన్నాయి. బంగ్లాదేశ్ నాలుగవ స్థానంలో ఉన్నది.

బంగ్లా జట్టు

జన్ముల్ హుస్సేన్ షాంతో, షాద్మాన్ ఇస్లాం, జకీర్ హసన్, మొమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్(వికెట్ కీపర్), షకీబ్ అల్ హసన్, లింటన్ దాస్, మెహిదీ హసన్ మీర్జా, జకీర్ అలీ, తస్కిన్ అహ్మద్, హసన్ మహమూద్, నహిద్ రాణా, తైజుల్ ఇస్లామ్,మహమదుల్ హసన్ జాయ్, నయిమ్ హసన్, ఖలీద్ అహ్మద్

హెడ్ విధ్వంసం.. ఆసీస్ ఘన విజయం

బలగం టీవీ, లండన్

సౌతాంప్టన్ వేదికగా జరిగిన తొలి టీ20లో ఇంగ్లాండ్‌పై 28 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది.

180 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 19.2 ఓవర్లలో 151 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బ్యాటర్లలో లివింగ్‌స్టోన్(37) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్ 3 వికెట్లు పడగొట్టగా.. హాజిల్ వుడ్, జంపా తలా రెండు వికెట్లు సాధించారు. వీరితో పాటు బ్రాట్‌లెట్, గ్రీన్, స్టోయినిష్ చెరో వికెట్ పడగొట్టారు.

ఇక తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 19.3 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ విధ్వంసం సృష్టించాడు. కేవలం 23 బంతుల్లోనే 8 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59 పరుగులు చేశాడు.అతడితో పాటు మాథ్యూ షార్ట్(41), ఇంగ్లిష్(37) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లలో లివింగ్‌స్టోన్ 3 వికెట్లు పడగొట్టగా.. ఆర్చర్, మహ్మద్ తలా రెండు వికెట్లు సాధించారు. కాగా ఇరు జట్ల మధ్య రెండో టీ20 సెప్టెంబర్ 13న కార్డిఫ్ వేదికగా జరగనుంది.

సినీ గేయ రచయిత గురుచరణ్ కన్నుమూత

బలగం టీవీ, హైదరాబాద్

ప్రముఖ తెలుగు సినీ గీత రచయిత గురుచరణ్ (77) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఇక గురుచరణ్ మరణవార్త తెలుసుకున్న సినీ పరిశ్రమ దిగ్భ్రాంతికి లోనైంది. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నారు. గురుచరణ్ అసలు పేరు మానాపురపు రాజేంద్రప్రసాద్. ప్రముఖ దర్శకుడు మానాపురపు అప్పారావు, నటి ఎంఆర్ తిలకం దంపతుల కుమారుడు ఇతను. గురుచరణ్‌కు చిన్ననాటి నుంచే సినిమా పాటలు రాయడం అంటే ఆసక్తి ఉండడంతో ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశాడు. అనంతరం దాదాపు రెండు వందలకు పైగా సినిమా పాటలు రాశారు. రౌడీ గారి పెళ్లాం లోని బోయవాని వేటుకు గాయపడిన కోయిల, అల్లుడుగారు సినిమాలోని ముద్దబంతి నవ్వులో మూగబాసలు లాంటి పాటలు అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచాయి.

సెన్సార్ పూర్తి చేసుకున్న 'దేవర'

బలగం టీవీ, హైదరాబాద్

యంగ్‌టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. . ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేశారు.

ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పనులు పూర్తిచేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సభ్యులు యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసినట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమా రన్‌టైమ్ 2 గంటల 57 నిమిషాల 58 సెకన్ల పాటు ఉండనుంది. ఇక మూవీలో విజువల్స్ అద్భుతంగా ఉంటాయని, చివరి 40 నిమిషాలు సినిమాలో హైలైట్ ఉంటుందని సెన్సార్ బోర్డ్ చెప్పినట్లు టాక్.

నేను డ్రగ్స్ తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధం

- **నటి హేమ**

బలగం టీవీ, హైదరాబాద్

బెంగళూరు రేవ్ పార్టీ కేసులో పోలీసులు ఫైనల్‌గా ఛార్జిషీట్ దాఖలు చేశారు. టాలీవుడ్ నటి హేమ డ్రగ్స్ తీసుకున్నట్టు నివేదికలో పేర్కొన్న పోలీసులు ఎండీఎంఏ మెడికల్ రిపోర్ట్‌ను కూడా జత చేశారు. ఈ కేసులో నటి హేమతోపాటు 88 మంది డ్రగ్స్ తీసుకున్నారని పోలీసులు వివరించారు. చార్జిషీట్‌లో రేవ్ పార్టీ నిర్వాహకులుగా 9 మందిని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో హేమ మీడియాతో మాట్లాడుతూ.. చార్జిషీట్‌లో తన పేరున్నట్టు తెలిసింది. తాను డ్రగ్స్ తీసుకోలేదు. తాను అసలు శాంపిల్సే ఇవ్వలేదు. తాను డ్రగ్స్ తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని చాలెంజ్ విసిరింది. ఓ వైపు హేమ డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసులు పేర్కొనడం.. మరోవైపు హేమ మాత్రం డ్రగ్స్ తీసుకోలేదంటూ చాలెంజ్ చేయడంతో.. ఈ వ్యవహారం ఎటువైపు వెళ్తుందనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ కేసులో హేమ ఇప్పటికే బెంగళూరు పరప్పన అగ్రహార జైలులో 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీలో ఉందని తెలిసిందే. అనంతరం బెంగళూరు రూరల్ ఎస్డీపీఎస్ స్పెషల్ కోర్టు ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇక డ్రగ్స్ కేసులో పట్టుబడటంతో మా (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) హేమను సస్పెండ్ చేయగా.. ఆగస్టులో ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేసింది.

మే 20న రేవ్ పార్టీలో పాల్గొన్న హేమకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్టు పోలీసులు నిర్ధారించారు. అయితే ఈ కేసులో విచారణకు హాజరుకావాలని పోలీసులు రెండు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ హేమ వెళ్లలేదు. హేమ మొదట బెంగళూరు రేవ్ పార్టీకి హాజరైనప్పటికీ.. తాను వెళ్లలేదంటూ పలు వీడియోలు కూడా విడుదల చేసింది. కానీ పోలీసులు రిలీజ్ చేసిన హేమ ఫొటోలోని డ్రెస్, హేమ విడుదల చేసిన వీడియోల్లోని డ్రెస్ ఒకే విధంగా ఉండటంతో ఆమె పార్టీకి వెళ్లినట్టు నిర్ధారణకు వచ్చారు.

మాజీ మంత్రి హరీశ్ రావు విడుదల..

బలగం టీవి, హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పోలీస్ స్టేషన్‌లో నుంచి విడుదలయ్యారు. కేశంపేట పీఎస్ నుంచి ఆయన హైదరాబాద్ బయలుదేరారు. హరీశ్ రావుతో పాటు బీఆర్ఎస్ నేతలు కూడా ఉన్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనలు విరమించాలని కోరారు. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిపై 307 కింద కేసు నమోదు చేస్తామని రాష్ట్ర డీజీపీ హామీ ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డ వారిపై కూడా చర్యలు తీసుకుంటామని డీజీపీ హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఒకవైపు గణేష్ నిమజ్జనం జరుగుతొందని.. హైదరాబాద్ లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు డీజీపీ హామీ మేరకు అందరం ఇక్కడి నుంచి బయలుదేరి వెళతామని ఆయన తెలిపారు. కార్యకర్తలను ఇబ్బంది పెట్టకుండా పోలీసులు కూడా తమ మాటపై నిలబడాలని విజ్ఞప్తి చేశారు. అధికారం శాశ్వతం కాదని ఈరోజు కాంగ్రెస్ పార్టీ వద్ద ఉండొచ్చు, రేపు మా దగ్గర ఉండొచ్చు.. కానీ చట్టం, న్యాయం పాటించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. మేం వెళ్లిన తర్వాత పోలీసులు కార్యకర్తలకు ఆటంకం కల్పిస్తే మళ్లీ ఇక్కడికి వచ్చి నిరసన తెలపాల్సి వస్తుందని అన్నారు. జిల్లాలోనూ బీఆర్ఎస్ కార్మికులను బైండోవర్ చేసినట్లు సమాచారం వచ్చిందని వారందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఇక ఇక్కడికి వచ్చిన కార్యకర్తలకు, నాయకులకు ఎన్ని రకాల కృతజ్ఞతలు చెప్పినా తక్కువే అని అన్నారు. కొద్ది నిమిషాల్లోనే మమ్మల్ని అరెస్టు చేసి ఇక్కడికి తీసుకువస్తున్నారని తెలియగానే ప్రాణాలకు తెగించి వచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలందరూ తమ గమ్యస్థానానికి క్షేమంగా చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కొడంగల్‌లో ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా ఆందోళన

బలగం టీవి, హైదరాబాద్

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మం డలంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతులు ఆందోళనను తీవ్రతరం చేశారు. ఈ ప్రాంతంలోకి ఫార్మా రావద్దంటూ మహిళలు గురువారం పోలేపల్లిలోని ఎల్లమ్మ దేవాలయంలో ముడుపు కట్టారు. అనంతరం బాధిత గ్రామాలకు చెందిన రైతు లు గో బ్యాక్ ఫార్మా అని నినదిస్తూ హకీంపేట చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. రైతుల ఆం దోళనకు సీపీఐ(ఎం), బీఆర్ఎస్ నాయకులు మద్ద తు పలికారు. సాగు భూముల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటుతో రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, వాయు, నీటి కాలుష్యం ఏర్పడి ప్రజలు రోగాల బారిన పడుతారని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు.

తరాల నుంచి భూ ములనే నమ్ముకుని వ్యవసాయం చేసుకుం టూ బతుకుతున్న తాము ఫార్మా ఏర్పాటు వల్ల కూలీలుగా మారే ప్రమా దం ఉన్నదని ఆవేదన చెందారు. ప్రభుత్వం వెంటనే స్పం దించి ఫార్మా విలేజ్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకుడు యాదయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి బినామీ పేర్లతో భూములు తీసుకుని ఫార్మా కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫార్మా కంపెనీని రానివ్వమని పేర్కొన్నారు. అనంతరం రిలే దీక్ష ప్రారంభించారు.

మణిపూర్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి నిప్పు

బలగం టీవి, హైదరాబాద్

మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలు కొనసాగు తున్నాయి. తాజాగా గురువారం తెల్లవారుజామున కొందరు దుండగులు ప్రభుత్వ ఆసుపత్రికి నిప్పుపెట్టారు. పోలీస్ అవుట్‌పోస్ట్ సమీపంలోనే ఈ చర్యకు పాల్పడ్డారు. జిరిబామ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బోరోబెక్రా ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టినట్లు అధికారులు తెలిపారు. సంఘటన సమయంలో పీహెచ్‌సీలో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఏమీ జరుగలేదని చెప్పారు. భద్రతా దళాలు వెంటనే అక్కడకు చేరుకున్నట్లు వెల్లడించారు.

కాగా, మణిపూర్‌లోని మెజారిటీ వర్గమైన మైతీలకు రిజర్వేషన్ కల్పించడాన్ని మైనారిటీ వర్గమైన కుకీలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది మే నుంచి మైతీ, కుకీ జాతుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి.

సెప్టెంబర్ 7న జిరిబామ్‌లో జరిగిన తాజా హింసలో ఐదుగురు మరణించారు.

బోరోబెక్రా సబ్ డివిజన్‌లోని నింగ్‌థెమ్ ఖునౌ, మోంగ్‌బంగ్ గ్రామాలను లక్ష్యంగా చేసుకున్నారు. మైతీ గ్రామమైన మోంగ్‌బంగ్‌లో కుకీ ఉగ్రవాదులు తుపాకీ కాల్పులు, బాంబు దాడులకు పాల్పడినట్లు మైతీ నేత ఆరోపించారు. దాడులను నిరోధించడానికి భద్రతా దళాలు మరింత కృషి చేయాలని కోరారు.

మరో తుఫాను ముప్పు

బలగం టీవి, హైదరాబాద్

తెలుగు రాష్ట్రాలకు మరో తుఫాను ముప్పు ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.

నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, జనగాం, వరంగల్, హన్మకొండ, ములు గు, కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మేడ్చల్–మలాజిగిరి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఏపీలోని కోస్తా, ఉత్తరాంధ్రలో మాత్రం భారీ వర్షాలకు అవకాశం ఉన్నట్టు చెప్పారు.

'మా నాన్న సూపర్‌హీరో' టీజర్ విడుదల

బలగం టీవి, హైదరాబాద్

హరోం హర సినిమాతో ఇటీవల మంచి విజయాన్ని అందుకున్నాడు నటుడు సుధీర్‌బాబు. ఆయన కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్‌హీరో' ఆర్జ కథానాయికగా నటిస్తుండగా.. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్నాడు. సాయిచంద్, సాయాజీ షిండే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే.. తండ్రి కొడుకుల సెంటిమెంట్‌తో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. సమ్మోహనం వంటి సూపర్ హిట్ తర్వాత మళ్లీ సుధీర్ బాబు ఇలాంటి క్లాస్ స్టోరీతో వస్తుండటంతో మూవీపై మంచి అంచనాలు ఉన్నాయి. దసరా సందర్భంగా అక్టోబర్ 11న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. రాజు సుందరం, శశాంక్, ఆమని, అన్నీ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాను సీఏఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి వి. సెల్యులాయిడ్స్ పతాకంపై సునీల్ బలుసు నిర్మిస్తున్నారు

ప్రజలను మోసం చేయడమే ప్రజా పాలనా?

- **కేంద్ర మంత్రి బండి సంజయ్**

బలగం టీవి, హైదరాబాద్

సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి, బిజెపి నేత బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో ఇన్నాళ్లు కొనసాగిన పాలన ప్రజా కంటక పాలన అని కాంగ్రెస్ అంగీకరించి నట్లేనా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడమే ప్రజా పాలనా? అని ప్రశ్నించారు.

గురువారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయానికి వచ్చిన బండి సంజయ్ జిల్లా పార్టీ నేతలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి సికింద్రాబాద్ జనరల్ బజారులోని బట్టలు, బంగారు దుకాణాల వద్దకు తిరుగుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో భారత్‌ను కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ కి ఈ దేశంలో ఉండే అర్హత లేదని మండిపడ్డారు. సిక్కులను ఊచకోత కోసిన చరిత్ర కాంగ్రెస్ సొంతమని, వారి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. అక్రమ నిర్మాణాలను మీరు కూలుస్తారా? మమ్ముల్ని కూల్చమంటారా? అంటూ సిఎం హెచ్చరించడం సిగ్గు చేటన్నారు. అక్రమ నిర్మాణాలని తెలిసి అధికారులు ఎట్లా అనుమతి ఇచ్చారు? వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నడ్డి విరగ్గొట్టడమే ప్రజా పాలనా? ఉద్యోగులకు ఇస్తామన్న టిఎ, డిఎ, పిఆర్‌సి ఇవ్వకుండా మోసం చేయడమేనా ప్రజా పాలనా? అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. అక్రమ నిర్మాణాలని తెలిసి అధికా రులెలా పర్మిషన్ ఇచ్చారు? రిజిస్ట్రేషన్ ఎట్లా చేశారు? బ్యాంకుల నుండి లోన్లు తీసు కుని ఇండ్లు కట్టుకుంటే కూలుస్తారా? ప్రభుత్వ నిర్వా కంవల్లే అక్రమ నిర్మాణాలు వెలిశాయి కదా? మరి అక్రమ నిర్మాణాలకు అనుమతు లిచ్చిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారో ముం దు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 6 గ్యారంటీలపై దృష్టి మళ్లించడానికి హైడ్రా పేరుతో హైడ్రామాలాడుతున్నారన్నారు.

దేశాన్ని చీల్చాలని కుట్ర చేసే వాళ్లతో రాహుల్ గాంధీ చేతులు కలుపుతున్నాడని, అందుకే ప్రత్యేక దేశం కావాలని భారత్ ను చీల్చాలనుకుంటున్న టెర్రరిస్టు సంస్థలు రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సమర్థిస్తున్నాయని బండి సంజయ్ విమర్శించారు. రాహుల్ కు, టెర్రరిస్టు సంస్థలకు లింకులున్నాయని అనుమానం వస్తోందన్నారు. గాంధీ పొరపాటున అధికారంలోకి వస్తే మళ్లీ దేశాన్ని 7 ముక్కలు చేసే ప్రమాదముందని తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.